




తెలుగుచలనచిత్రచరిత్రలో తనకంటూ ఒక ప్రత్యేక అధ్యాయాన్ని సువర్ణాక్షరాలతో లిఖించుకున్న శ్రీ వేటూరి సుందరరామమూర్తి గారు, సినీరంగప్రవేశానికి ముందే ఎన్నో కవితలు, గేయాలు, గేయరూపకాలు, కథలు, వ్యాసాలు, సినీ సమీక్షలు, సీరియల్స్ వ్రాశారన్న విషయం అందరికీ తెలిసి ఉండకపోవచ్చు. ఆ రోజుల్లో వారి కలంపేర్లు కొన్ని - శుభశ్రీ, రామం, సరళ.. వేటూరిగారి సినిమాయేతర సాహిత్యాన్ని పాఠకులకి అందించడమే ఈ శీర్షిక ముఖ్యోద్దేశం. ఈ అంశాలని కౌముదికి అందించిన, పునర్ముద్రణకి అనుమతించిన వేటూరి రవిప్రకాష్(సుందరరామమూర్తిగారి పెద్ద కుమారుడు)గారికి కౌముది ధన్యవాదాలు తెలియచేస్తోంది.

## వలపుదారపుపోగు

నెలవంక నిదురించు నెలత పెదవులపైని
అలవోకనగవు వెన్నెలలు పూసినవేళ
తలపుటంగీలలో వలపుదారపుపోగు
త్రుంచి నే నందింతునా—పులుగునై
మించి యానందింతునా—

కలికి నుదుటింటిలో తళుకయై తిలకమ్ము
కులికి తళుకుల నొలుకు మొలకయై మురియగా
జీవితాలయములో దేవి దర్శనమంది
జేగంట మ్రోగింతునా—హారతులు
శ్రీగంట వెలయింతునా—

ఎదల సౌదల నూని కదలాడ నూర్పులతొ
ఉదధి సదృశ మహోదార వక్షమ్ముపై
కైలాస శిఖరాగ్ర శైలూషికానాట్య
దర్శినై తరియింతునా—సంద్రాన
తర్కాన పయనింతునా—

"రామం"

1960 ఏప్రిల్ 27, ఆంధ్రపత్రిక దీపావళి సంచికనుంచి

# గ్రీష్మగీతి

నిరాఘ గ్రీష్మము – వ్యథా
విస్ఫులింగ వితతము
అడియాసల వడగాల్పుల
పిడచగట్టినది గళము
కాదు చెలీ యిది గ్రీష్మం
నీవు లేని నిస్పృహలో
నాలో రోహిణి జననం——.

* * *

వేసవి యిది క్రాంత వలపు
వాచవి గోరుకున్న నాటి
మధుపర్కం కట్టిన మధు
మధుసంపర్కము——గాథ!
ఆనా శాంతం నా స్వాంతం
కదలించే మధురగాథ!

* * *

కన్నుల కావేరులలో
కలల సావేరులలో
కాదిగో! నా ఆలాపన
కాదు సుమా ప్రేలాపన.

* * *

గతం అనాగతం అనా
గతం కదా భవిష్యం——
ఎక్కడ ఆశే కడలి కొన
ముగిసినవి ఆటుపోటు——
ఎక్కడాలో ఎక్కడపోయి.
వర్ధమాన వర్ధమాన
ఆర్ద్ర నాకు మధుగీతం
నిండు యౌవనం తానికి
నవీన మా సంగీతం!

'వేటూరి'

COMMENTS